
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
గురువారం 1 ఫిబ్రవరి 2024



రాజన్న ఆలయాభివృద్ధిపై సీఎం సమీక్ష
- రూ.20 కోట్ల నిధుల విడుదలకు ఆదేశం

ఆకట్టుకున్న సంగీత కచేరి
- కొనసాగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

7లో..



మెగా క్లస్టర్‌పై ఆశలు

- కేంద్ర బడ్జెట్ వైపు సిరిసిల్ల నేతన్నల చూపు
- ప్రతీసారి మొండిచేయి • నేడు కేంద్ర బడ్జెట్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కేంద్ర బడ్జెట్ అనగానే సర్వత్రా ఆసక్తి నెలకొంటుంది. పన్నులు, మినహాయింపులు, కొత్త పథకాల వంటివి చర్చనీయాంశంగా మారుతాయి. ప్రధానంగా రాష్ట్రం, ప్రాంతాలకు ప్రయోజనం చేకూరే ప్రకటన వస్తుందని నిరీక్షిస్తారు. సిరిసిల్ల నేతన్నలు కూడా దశాబ్దకాలంగా మెగా పవర్‌లూం క్లస్టర్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అందరి దృష్టి అటువైపే ఉంది. ఈసారి ఎన్నికల ఏడాది కావడంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మెగా పవర్‌లూం క్లస్టర్ వస్తుందని నేత కార్మికులు, వస్త్రోత్పత్తి దారులు ఆశతో ఉన్నారు. సిరిసిల్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు వివిధ పార్టీల నాయకులు సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అనేకసార్లు మెగా పవర్‌లూం క్లస్టర్‌పై లేఖలు రాయడం, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై విమర్శలు చేయడం సాధారణమైంది. ఈసారి కూడా బడ్జెట్‌లో మెగా పవర్‌లూం క్లస్టర్ వస్తుందనే ఆశాభావంతోనే ఉన్నారు.



హామీలకే పరిమితం

గతంలో సిరిసిల్ల నేత కార్మికుల బలవన్మరణాలు, ఆకలి చావులు కేంద్ర, రాష్ట్రాలను కుదిపేశాయి. దీంతో కేంద్ర ప్రభుత్వ బృందాలు సిరిసిల్లలో పర్యటించాయి. మెగా పవర్‌లూం క్లస్టర్, టెక్స్‌టైల్ జోన్‌గా ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చింది. అదికాస్తా హామీలకే పరిమితమైంది. ప్రతీ కేంద్ర బడ్జెట్ సమయంలో సిరిసిల్ల నేతన్నలు ఎదురు చూస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సిరిసిల్లను మెగా పవర్‌లూం క్లస్టర్‌గా మార్చాలనే ప్రతిపాదనలు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి పంపిస్తూనే ఉన్నారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర జౌళి శాఖ మంత్రి కావూరి సాంబశివరావును ప్రస్తుత బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మెగా పవర్‌లూం క్లస్టర్ హామీని పొందారు. అప్పటి బడ్జెట్‌లోనే ప్రకటిస్తారని ఆశించారు. కానీ నిరాశే మిగిలింది. 2004లో తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి వద్ద 60 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కును రూ.7.73 కోట్లతో ఏర్పాటు చేశారు. టెక్స్‌టైల్ పార్కులో ఆధునిక మర మగ్గాలను స్థాపించారు. దేశ విదేశీ మార్కెట్ లో అమ్ముడుపోయే విలువైన వస్త్రాలను ఉత్ప త్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్న పార్కు లోకి అనుబంధ పరిశ్రమలు రాకపోవడంతో ఉత్ప త్తుల్లో పెద్దగా మార్పులు రాలేదు. సిరిసిల్లలో టెక్నాలజీ మరమగ్గాలపై ఆధు నిక ఉత్పత్తులు చేయలేక తరచూ పరిశ్రమ సంక్షోభాన్ని చవి చూసింది. ఆత్మహత్యలు, సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్లలో మా ర్పులు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. అప్పటి కేంద్ర ప్రభుత్వం సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్‌ను ఇస్తామని హామీ ఇచ్చినా కాంగ్రెస్ ప్రభు త్వం మారిపోయి బీజేపీ ప్రభుత్వం రావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. 2016 బడ్జెట్ సమయంలో అప్పుడు రాష్ట్ర మంత్రిగా కేటీఆర్ మూడు సార్లు ఢిల్లీకి వెళ్లి, అప్పటి చేనేత జౌళిశాఖ మంత్రి సంతోష్ గంగువార్‌ను కలిశారు. వస్త్ర పరిశ్రమ సమస్యలను వివరించారు. మెగా పవర్‌లూం క్లస్టర్ ప్రతిపాదనలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి పంపించామని తెలపడంతో ఆ బడ్జెట్‌లో పవర్‌లూం క్లస్టర్‌కు చోటు దక్కుతుందని భావించారు. మొదటి విడతలో దేశంలో ఐదు మెగా క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా సిరిసిల్లకు చోటు దక్కలేదు. 2017 బడ్జెట్ సమయంలోనూ కేటీఆర్, అప్పటి ఎంపీ వినోద్ చేనేత జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీని కలిసి మెగా పవర్‌లూం క్లస్టర్‌ను సాధించుకునే విధంగా చర్యలు చేపట్టారు. కానీ ఆ బడ్జెట్‌లోనూ మోక్షం లభించలేదు. అదే క్రమంలో 2018, 2019, 2020, 2021, 2022, 2023 బడ్జెట్‌లో కూడా అదే పరిస్థితి. ఈసారి ఎలా ఉండబోతుందనే ఆసక్తి ఏర్పడింది. గత రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల నేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వ ఆర్డర్లను అందించింది. బతుకమ్మ చీరల ద్వారా కార్మికులు నెలకు రూ. 16 నుంచి రూ.18 వేల వరకు వేతనాలు పొందుతూ వచ్చారు. మరోవైపు అపెరల్ పార్కులో గార్మెంట్ పరిశ్రమ మొదలవడంతో మహిళలకు ఉపాధి లభిస్తోంది. కార్మికులను యజమా నులుగా మార్చేవర్కర్ టు ఓనర్ పథకం పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. లబ్ధిదారుల ఎంపిక మాత్రమే మిగిలింది. ఇదే దశలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ప్రభుత్వ ఆర్డర్లపై కొంత సందిగ్ధం నెలకొన్నా మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లాకు చెందిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఆర్డర్లే కాకుండా నేత కార్మికులను అదుకుంటామనే హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో పాఠశాల విద్యార్థుల యూనిఫాం బట్ట ఆర్డర్లు కూడా రావడం మొదలైంది.

ఒడిదుడుకుల ప్రస్థానం

సిరిసిల్లలో నేత కార్మికుల ఆత్మహత్యలను నివారించి వారి కుటుంబాలను ఆదుకునే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు దాదాపు ఇరవై ఏళ్లుగా ఒడిదుడుకుల మధ్య ఏదురీదుతోంది. నిరంతరం ఉత్పత్తి ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఎప్పుడైనా కూలి పెంపు, సమస్యల పరిష్కారం కోసం కార్మికుల ఆందోళనతో పరిశ్రమలు మూతపడేవి. నెల రోజుల క్రితం మార్కెట్‌లో బట్టకు గిట్టుబాటు ధరలేక టెక్స్‌టైల్ పార్కులో యజమానుల నిరవధిక బంద్ చేపట్టారు. ఆర్వీఎంతోపాటు ఇతర ఆర్డర్లు వస్తాయనే భరోసాతో తిరిగి ఉత్పత్తులు ప్రారంభించారు. ఇప్పటికి పూర్తి స్థాయిలో పరిశ్రమలు కొనసాగడం లేదు. 2002 - 2003 సంవత్సరంలో సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం సారంపల్లి, బద్దెనపల్లి గ్రామాల మధ్య 60 ఎకరాల్లో రూ.7.73 లక్షలతో టెక్స్‌టైల్ పార్కును నిర్మించారు. 2004లో పార్కు పూర్తయిన పరిశ్రమల స్థాపనకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రభుత్వం తరఫున అధికారులు గుజరాత్, మహారాష్ట్రలోని పారిశ్రామికులను కలిసి ఆహ్వానించారు. వివిధ హామీలు ఇవ్వడంతో పరిశ్రమల స్థాపనకు వారు ముందుకొచ్చారు. సిరిసిల్ల పార్కులో 1200 గజాల చొప్పున 171 ప్లాట్లు, 600 గజాల చొప్పున 106 ప్లాట్లు, 32 వాణిజ్య అవసరాల కోసం ప్లాట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టెక్స్‌టైల్ పార్కులో 165 ఇండస్ట్రీయల్ యూనిట్లు, 27 కమర్షియల్ యూనిట్లు ఉన్నాయి. ఇందులో 115 యూనిట్లలో 1475 ఆధునిక రాపియర్ మరమగ్గాలపై ఉత్పత్తి జరుగుతున్నా టెక్స్‌టైల్ రంగంలోని సంక్షోభంతో నడవని పరిస్థితి ఏర్పడింది. పార్కులో గతంలో ప్రైవేటు బట్ట ఉత్పత్తులపైనే ఆధారపడ్డారు. ఇదే క్రమంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్, ఆర్వీఎం క్లాత్ ఉత్పత్తి ఆర్డర్లను పార్కుకు కేటయించారు. ప్రభుత్వ ఆర్డర్లు రావడంతో పార్కులోని పరిశ్రమల్లో ప్రైవేటు ఉత్పత్తులు దూరమయ్యాయి. ప్రైవేటు ఉత్పత్తులు అనుకూలంగా రాకపోవడంతో పార్కులో పరిశ్రమలు భారంగా మారాయి. మరోవైపు విద్యుత్ భారం కూడా ఉంది. గతంలో సిరిసిల్ల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు బట్ట ఎగుమతులు ఎక్కువగా జరిగేవి. తమిళనాడు, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, అహ్మదాబాద్, కేరళ, ఢిల్లీ వరకు సిరిసిల్ల బట్ట వెళ్లేది. ప్రస్తుతం కేవలం గుజరాత్‌లోని సూరత్, మహారాష్ట్రలోని భీవండిపైనే ఆధారపడి ఉత్పత్తి చేస్తున్నారు. సిరిసిల్లలో ఆధునిక ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవడం, బట్ట ఉత్పత్తిలో మార్పులు రాకపోవడంతో నష్టాలకు కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికి టెక్స్‌టైల్ పార్కులో బట్ట అమ్ముడుపోక రూ. 30 కోట్ల విలువైన బట్ట నిల్వలు ఉండిపోయాయి.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ

సిరిసిల్ల క్రైం, జనవరి 31: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలు తెలిస్తే సమాజంలో జరిగే అన్యాయాలపై ప్రజలను చైతన్యవంతులను చేయవచ్చన్నారు. 0-14సంవత్సరాలలోపు పిల్లలందరూ పనికి వెళ్లకుండా బడిలోనే ఉండాలన్నారు. బాలికలను ఎవరైనా వేధిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంగా బాలికలపై అఘాయిత్యాలు పెరిగాయని , వాటిని నివారించడానికి కృషి చేయాలని అన్నారు. మైనర్‌లను వేధిస్తే కఠిన చర్యలు తీసుకునే విధంగా పోక్సో చట్టం అమలులో ఉందన్నారు. ప్రతీ ఒక్కరు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే అన్యాయాలు, అక్రమాలు తగ్గుతాయన్నారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, బూరకళ్యాణి, పెంట శ్రీనివాస్, ఆంజనేయులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ముస్తాబాద్, జనవరి 31:పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు డీఈవో రమేశ్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం పరిశీలించారు. పలు అంశాలపై పదోతరగతి విద్యార్థులను ప్రశ్నించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజిరెడ్డి, ఉపాధ్యాయుడు తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 31 : పదోతరగతి విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, చదువుకునేలా చూడాలని శివనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోతీలాల్ సూచించారు.సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులను సోషల్ మీడియాతోపాటు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. పాఠశాల స్టాఫ్ కార్యదర్శి మల్లారపు పురుషోత్తం, హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాతూరి మహేందర్‌రెడ్డి, రవీందర్,సాంబయ్య, శ్రీహరి, లక్ష్మయ్య, నారాయణ, సమ్మయ్య సంధ్యారాణి, సరిత, ఏజాజ్‌ఫాతిమా పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

ఇల్లంతకుంట, జనవరి 31:భూగర్భజలాలు తగ్గి పంటలు ఎండిపోతున్నందున అన్నపూర్ణ రిజర్వాయర్ కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు మ్యాకల మల్లేశం ఒక ప్రకటనలో కోరారు. మండలానికి రెండువైపుల ప్రాజెక్టులు ఉన్నా రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. లేని పక్షంలో రైతుల తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 31 : మైనార్టీ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారీ సంక్షేమ అధికారి బొద్దుల గంగయ్య తెలిపారు. కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని రీజినల్ స్థాయి కో-ఆర్డీనేటర్‌లు, జిల్లా విజిలెన్స్ అధికారులు, మైనార్టీ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లతో సమీక్షించారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరం ప్రవేశాలపై చర్చించారు. జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరంతోపాటు మెడికల్, ల్యాబ్ టెక్నీషియన్, డెయిరీ టెక్నాలజీ వృత్తి విద్యా కోర్సులలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందడానికి అర్హతగల విద్యార్థులు ఫిబ్రవరి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో మైనార్టీ ప్రత్యేక అధికారి సర్వర్‌మియా, జిల్లా విజిలెన్స్ అధికారులు షౌకత్‌అలీ, అహ్మద్‌అలీ, ప్రిన్సిపాల్‌లు ఉరూస్ ఫాతిమ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య



కరపత్రాలను అందజేస్తున్న అధ్యాపకులు

రుద్రంగి, జనవరి 31: నాణ్యమైన విద్య కోసం ఆగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని అధ్యాపకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ఇంటర్మీడియెట్ సెంకడ్ ఇయర్ విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ తరగతుల ద్వారా విద్యా బోధన సాగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ మల్లారెడ్డి, కీర్తి రాజేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ క్రికెట్ లీగ్ ఫైనల్

సిరిసిల్ల క్రైం, జనవరి 31: సిరిసిల్ల పోలీస్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ ఫైనల్ మ్యాచ్ గురువారం నిర్వహించనున్నారు. డీజీ బ్రేవ్ సోల్జర్స్, సిరిసిల్ల స్ట్రైకర్స్ జట్లు ఫైనల్‌లో తలపడనున్నాయి. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సెమిఫైనల్స్‌లో నాలుగు జట్లు తలపడ్డాయి. ఎంటీ ఈగల్స్ డీజీ బ్రేవ్ సోల్జర్స్ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఎంటీ ఈగల్స్ నిర్ణీత 12 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన డీజీ బ్రేవ్ సోల్జర్స్ జట్టు 9.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 79 పరుగులతో విజయం సాధించింది. 30 పరుగులతో మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఫణీంద్ర మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అందుకున్నాడు. రెండో మ్యాచ్‌లో సిరిసిల్ల స్ట్రైకర్స్, వేములవాడ రుద్రాస్ జట్లు తలపడగా సిరిసిల్ల స్ట్రైకర్స్ నిర్ణీత 12ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వేములవాడ రుద్రాస్ జట్టు 12 ఓవర్లలో 104 పరుగులు చేసి సిరిసిల్ల స్ట్రైకర్స్ చేతిలో ఓటమి చవిచూసింది. 39 పరుగులు చేసి ఒక వికెట్ తీసి విజయంలో కీలకంగా వ్యవహరించిన రాజశేఖర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. అంతకుముందు సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి పోటీలను ప్రారంభించారు.

ప్రజాసేవే ప్రజాప్రతినిధుల అంతిమ లక్ష్యం

వేములవాడ రూరల్, జనవరి 31: ప్రజాసేవే ప్రజాప్రతినిధుల అంతిమ లక్ష్యమని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. పేద వారికి మెరుగైన వైద్యం అందించడంలో వైద్యాధికారులు ముందుండాలన్నారు. మిషన్ భగీరథ పనుల్లో భాగంగా కట్ చేసిన సీసీ రోడ్లను బాగు చేయాలని సర్పంచ్ మల్లేశం కోరారు. సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నందున విధుల్లో చేరే ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సర్పంచులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే అధికారులతోగానీ, ఇతర ప్రజా ప్రతినిధులతోగానీ పదవీకాలంలో వాగ్వాదాలు జరిగాయని వ్యక్తిగతంగా పార్టీలకతీతంగా అందరం ఒక్కటేనని సర్పంచులు, ఎంపీటీసీలు తెలిపారు. అనంతరం జడ్పీ చైర్ పర్సన్ అరుణ, ఎంపీటీసీలు సర్పంచులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కుల కవితతిరుపతి, ఎంఆర్‌వో సుజాత, ఎంపీడీవో రాంరెడ్డి, సూపరింటెండెంట్ రమేష్, సర్పంచులు ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్పంచులను సన్మానిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ అరుణ

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, జనవరి 31: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం బోయినపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాన్వాడలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జెగ్గారావుపల్లెలో మురికి కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మర్లపేటలో జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొదురుపాకలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉందని, త్వరితగతిన పథకాలను అమలు చేస్తామని అన్నారు. అంతకుముందు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్, రిటైర్డ్ ఎంఈవో రామరాజు తేనీటి విందుకు ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, సింగిల్ విండో చైర్మన్ వేసి రెడ్డి దుర్గారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కట్ట లచ్చయ్య, సర్పంచులు రామిడి శ్రీనివాస్, నంది సౌందర్యసంపత్, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకు బండి శ్రీనివాస్, నాగుల వంశీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కోనరావుపేట, జనవరి31 : కోనరావుపేట మండలం కనగర్తి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి బిక్కుమల్ల సహస్ర రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ సిరిసిల్లలోని మినీ స్టేడియంలో బుధవారం నిర్వహించారు. అండర్ 10 విభాగంలో 100 మీటర్ల పరుగుపందెంలో సహస్ర జిల్లాస్థాయిలో మొదటిస్థానాన్ని సాధించింది. లాంగ్ జంప్‌లో సహస్ర మొదటి స్థానం, కురుకుంట్ల ఆదిత్య మూడోస్థానాన్ని సాధించారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు సహస్ర ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. సహస్రను ప్రధానోపాధ్యాయులు దేవదాస్, మధు, ఉపాధ్యాయులు, పీఈటీ అజయ్, ఎస్‌ఎంసీ సభ్యులు అభినందించారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సఖీ కేంద్రం కోఆర్డినేటర్ రోజా

వీర్నపల్లి, జనవరి 31: మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి కేంద్రం కోఆర్డినేటర్ రోజా అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సఖీ కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం ప్రాధాన్యంపై వివరించారు. మహిళలు ఇబ్బందులకు గురైనప్పుడు వెంటనే టోల్ ఫ్రీ నంబరు 181కి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నర్సయ్య, బాల రక్ష సిబ్బంది విజయ, సఖి కేంద్రం సిబ్బంది సంతోషి, ఎంపీటీసీ అరుణ్ కుమార్, మహిళ సంఘాల సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వేసవి నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి
- సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, నివాళి తెలుపుతున్న కౌన్సిల్

సిరిసిల్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవి దృష్ట్యా ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ మేరకు సిరిసిల్ల పట్టణ శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఆయా ప్రాంతాల్లో మంచి నీటి సరఫరా కోసం పైపులైన్‌లు వేయడానికి రూ.25 లక్షల నిధులు కేటాయిస్తూ ఆమోదించారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అధ్యక్షతన సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. 16 అంశాలతో కూడిన ఎజెండాను ఆమోదించారు. ఇటీవల మృతిచెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తవుటు కనకయ్యకు కౌన్సిల్ మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం సిరిసిల్ల బల్దియాలో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి డంపింగ్ యార్డులో పవర్‌బోర్ ఏర్పాటు, ప్రహరీ నిర్మించాలని ఆమోదించారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ సిరిసిల్ల అభివృద్ధిలో భాగంగా విలీన గ్రామాలు, జంక్షన్ల అభివృద్ధికి అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ కృషితో గత ప్రభుత్వం రూ.40 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకొని పనులు చేపట్టే దశలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు నిలిపివేసినట్లు చెప్పారు. ఈ విషయమై తొలిసారిగా సిరిసిల్లకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పాలకవర్గం ఏర్పాటై నాలుగు సంవత్సరాలు గడిచి పోయిందని మిగిలిన సంవత్సర కాలం కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన సిరిసిల్లగా నిలపడానికి పాలకవర్గ సభ్యులందరం సమిష్టిగా కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ అయాజ్, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వేములవాడ టౌన్, జనవరి 31: మద్యం మత్తులో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి చెందిన సంఘటన వేములవాడ మండలం అనుపురం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మేర్గు శ్రీనివాస్ (26) అనే వ్యక్తి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. దీంతో గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు మృతుడి భార్య శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది.



జి సాయిప్రియ

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు డిగ్రీ విద్యార్థిని

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 31: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే 49వ జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల క్రీడాకారిణి జి సాయిప్రియ ఎంపికైంది. గత నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ చాటి కరీంనగర్ జట్టుకు 3వ స్థానాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించిన ఆమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి శ్రీధర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ టి. శ్రీలక్ష్మి, అధ్యాపక బృందం అభినందించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

తిమ్మాపూర్, జనవరి31: మండలంలోని మొగిళిపాలెం జిల్లా ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అపూర్వ ఫిబ్రవరి 2 నుంచి 6వరకు చత్తీషఘడ్ రాష్ట్రం, ఖాటీర్ దాంలో జరగనున్న జాతీయ స్థాయి పాఠశాలల క్రీడల ఆధ్వర్యంలో జరగనున్న సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. జనవరి 16 నుంచి 18 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన 67వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ 14 సంవత్సరాల విభాగం పోటీల్లో కరీంనగర్ జిల్లాకు అపూర్వ, సాయి శరణ్యలు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో మూడవ స్థానంలో గెలుపొందగా అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అపూర్వను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అపూర్వను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పిఈటి అడేపు శ్రీనివాస్ , ఉపాధ్యాయులు ఈశ్వర్, వివేక్, విద్యా సాగర్, దేవేందర్, లక్ష్మి, తిరుమల, గ్రామ సర్పంచ్ సుస్మితరెడ్డి, ఎంపిటిసి తిలక్ ప్రియారెడ్డి అభినందించారు.

సైబర్ మోసంతో డబ్బులు మాయం

వీణవంక జనవరి31: మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన పురంశెట్టి వెంకటేష్ మొబైల్ ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. బీట్‌కాయిన్‌తో ఎంత డబ్బులు పెడితే అంతకు రెట్టింపు డబ్బులు వస్తాయని తప్పుడు సంకేతాలు ఇచ్చి 6,42,040 రూపాయలు కాజేశారని అనంతరం ఎలాంటి స్పందన లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ప్రజలు మొబైల్ ఫోన్‌కు వచ్చే అనవసరపు లింకులు ఓపెన్ చేయవద్దని సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా మోసపోవద్దని తెలిపారు.

డైట్‌లో పద్య రచన కార్యశాల

తిమ్మాపూర్, జనవరి31: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో బుధవారం పద్య రచన కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ప్రముఖ కవి, అవధాని, సాహితీ రత్న డాక్టర్ గండ్ర లక్ష్మణరావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. పద్యం సాంస్కృతిక వారసత్వాన్ని, జాతి జీవనాన్ని భావితరాలకు అందిస్తుందన్నారు. పద్యం బ్రహ్మ పదార్థం కాదని, పద్యం రాయడం చాలా తేలిక అని తెలిపారు. పద్యం లయను, నాడిని, నడకను పట్టుకుంటే పద్య రచన చాలా తేలిక అని అన్నారు. పద్యంలో చందోనియమాలు ఉన్నప్పటికీ ఆ చందస్సు నియమమే పద్య రచనలను చాలా హృద్యంగంగా, రసనైకవేద్యంగా మలు స్తుందన్నారు. పద్య లక్షణాలను గణాలను, యతిప్రాసలను వివరిస్తూ ఏఏ సందర్భాల్లో ప్రాస నియమం పాటించబడుతుందో సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య మాట్లాడుతూ జిల్లా విద్యా శిక్షణ సంస్థ కేవలం పెడగాగికి సంబంధించిన అంశాలే కాకుండా ఛాత్రోపాధ్యాయుల పరిపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దోహదపడే విధంగా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగానే పద్య రచనపై కార్యశాల నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యశాలను ఉపయోగించుకొని భవిష్యత్తులో విద్యార్థులు మంచి పద్య కవులుగా ఎదగాలని ఆశిస్తున్నామన్నారు. విభిన్న అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు కె.శంకర్, చెరుకు ప్రద్యుమ్న కుమార్, మహేశ్వర్‌రెడ్డి, గాజుల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజన్న ఆలయాభివృద్ధిపై సీఎం సమీక్ష

● రూ.20 కోట్ల నిధుల విడుదలకు ఆదేశం ● రోడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణానికి త్వరలో రూ.35 కోట్ల నిధులు

సిరిసిల్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి గతంలో హెచ్ఎండీఏ సాఫ్ట్ లోన్ ద్వారా మంజూరై నిలిచిన రూ.20 కోట్ల నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న పనులపై పవర్ ప్రజంటేషన్ ద్వారా వీటీడీఏ వైస్ ఛైర్మన్ అనురాగ్ జయంతి ముఖ్యమంత్రికి వివరించారు. దేవస్థానం అభివృద్ధి, బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి నమూనాలను, పార్కింగ్ స్థలంలో టూరిజం శాఖ చేపడుతున్న పనులను వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నిలిచిపోయిన నిధులు రూ 20 కోట్లను విడుదల చేయాలని ఆదేశిస్తూ బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి, శివార్చన మండప నిర్మాణం, గుడిచెరువు సుందరీకరణ, నటరాజ విగ్రహం ఏర్పాటుతోపాటు పార్కు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధితోపాటు టూరిజం శాఖ పనుల్లో వేగం పెరగాలన్నారు. వేములవాడ పట్టణ ప్రజలతో పాటు రాజన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా మూలవాగు బ్రిడ్జితో పాటు బ్రిడ్జి నుంచి 800 మీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. రోడ్ల విస్తరణతోపాటు మూలవాగు బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన రూ.35 కోట్లు నిధులు త్వరలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. గుడిచెరువులోకి వివిధ కాలువల ద్వారా మురికి నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నూతన కాలువల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మురుగు కాలువల నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల విడుదల చేయాలని, మురుగు నీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయాలని అన్నారు. గుడిచెరువు విస్తీర్ణం, పార్కింగ్ స్థలాల వివరాలను సీఎం తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిషోర్, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్, వేములవాడ దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్, వేములవాడ కమిషనర్ అవినాష్ పాల్గొన్నారు.


ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆది శ్రీనివాస్

ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదం

హైదరాబాద్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమీక్ష సమావేశం సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజ రాజేశ్వరస్వామి ప్రసాదాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. మురికి నీటి కాలువల నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేసి వీటీడీఏ సమావేశాన్ని నిర్వహించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బియ్యం షాపులపై తూనికలు కొలతల శాఖ దాడులు

● ఐదు కేసులు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 31: నగరంలోని బియ్యం షాపులపై తూనికలు కొలతల శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహిచి ఐదు కేసులు నమోదు చేశారు. నగరంలోని గంజ్ ప్రాంతంలో వినియోగదారుల ఫిర్యాదు మేరకు శ్రీమాతారైస్‌డిపో, సాయిసరస్వతి కిరాణం, ఉప్పల క్రిష్ణమూర్తి కిరాణ షాపులపై దాడులు చేసి ఐదు కేసులు నమోదు చేసి, 230 రైస్ బ్యాగులు సీజ్‌చేశారు. ఈ దాడుల్లో లీగల్ మెట్రాలజి కరీంనగర్ జోన్ ఎసి కె విజయసారథి, కరీంనగర్ జిల్లా ఇన్స్‌పెక్టర్ భూలక్ష్మి, ఇన్స్‌పెక్టర్ డి రూపేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో జింకు లోపాన్ని గుర్తించాలి

గంగాధర, జనవరి 31: వరిలో జింకు లోపం నివారణకు పొలాలు ఎర్రబడకుండా ఉండేందుకు జింకు వేయాలని జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కాసారం, పోతుగంటిపల్లి, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి వేసుకున్న రైతులు తప్పకుండా మెలుకువలు పాటించాలని, ఎప్పటికప్పుడు పంట ఏ రకంగా పెరుగుతుందో పరిశీలించాలన్నారు. ఇటుక రంగుతో పైరు ఎర్రబారిన వెంటనే జింక్ వేసుకోవాలని జింక్ వేయకుండా నిర్లక్ష్యం చేస్తే పంటలు పాడవుతాయన్నారు. ప్రస్తుతం పొలాల్లో జింక్‌లోపం, కాండం తొలుచుపురుగు, సల్ఫైడ్ ప్రభావం కనిపిస్తుందన్నారు. నివారణకు తగిన మందులు వాడాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏవో రాజు, ఆయా గ్రామాల రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.



అంజన్న భూములపై డిజిటల్ సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మల్యాల, జనవరి 31: దిగువ కొండగట్టులో గల ఆంజనేయస్వామి దేవస్థానం భూములను అధికారులు బుధవారం డిజిటల్ సర్వే చేశారు. సర్వే నంబర్ 380సిలో దేవస్థానానికి 1.30ఎకరాల భూమి ఉండగా అందులో ఇటీవల అక్రమ నిర్మాణం జరుగుతుందని పలువురు ఫిర్యాదు చేయడంతో సర్వే చేపట్టారు. పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఏఈ లక్ష్మణ్‌రావు, సుధాకర్‌రెడ్డి తదితరులు సర్వే సిబ్బందితో దేవస్థానం భూమిని, నిర్మాణాన్ని పరిశీలించారు.



ధర్మపురిలో బీసీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ పూజలు

ధర్మపురి, జనవరి 31: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బీసీ వెల్ఫేర్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ దంపతులు బుధవారం సందర్శించారు. ఆలయం సంప్రదాయం ప్రకారం అర్చకులు, సిబ్బంది వారికి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. అలాగే వారు అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడా సందర్శించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. వారి వెంట బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సాయిబాబా, బీసీ హాస్టల్ వార్డెన్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, హాస్టల్ వార్డెన్స్ సుధాకర్, నివేదిత, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న చంద్రశేఖర్ దంపతులు

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు


వేములవాడలో నృత్య ప్రదర్శన

వేములవాడ, జనవరి 31 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో రెండో రోజు బుధవారం నిర్వహించిన పలు సంగీత నృత్య కార్యక్రమాలు కళాభిమానులను ఆకట్టుకున్నాయి. ఉదయం శిఖామణి భాగవతారిణి హరికథా గానం చేయగా మధ్యాహ్నం జయకృష్ణ భాగవతార్ హరికథ వినిపించారు. సాయంత్రం కె. నరహరి శర్మ, హెచ్. సతీష్, ఆర్. హరికృష్ణ సంగీత కచేరితో సంగీతాభిమానులను అలరించారు. అనంతరం డీవి మోహన కృష్ణ శాస్త్రీయ సంగీత కచేరి చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం ఎన్. సతీందర్, ఆర్. విజయశ్రీ, శ్రీదేవి, వి. శరణ్య, అశ్విని బృందం నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. రాత్రి శ్రీత్రైలోక్య ఆర్ట్ క్రియేషన్స్ బృందం వారు నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను రంజింపజేసింది.

గట్టుసింగారంలో వెలుగులోకి రాతి చిత్రాలు


రాతి చిత్రాలతో ఉన్న గుహను చూపిస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం

పంజాగుట్ట,జనవరి31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గట్టుసింగారం గ్రామంలోని సీతమ్మ లొద్దిలో పాము పడగలా ఉన్న అతి పెద్ద రాతి గుహ, అద్భుతమైన రాతి చిత్రాల సంపద వెలుగులోకి వచ్చింది. ఆరున్నర కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడ్డ నత్తగుల్ల శిలాజం, లక్ష సంవత్సరాల క్రితం నాటి రాతి గొడ్డలి, సూక్ష్మ రాతి పనిముట్లు, తొలి చారిత్రక యుగానికి చెందిన ఆరు శాసనాలు, చిత్రాలు వెలుగు చూశాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందం గౌరవ సలహాదారుడు, ఫొటో జర్నలిస్ట్ డి.రవీందర్ రెడ్డి దీనిని వెలుగులోకి తెచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామగిరి ఖిల్లా వెనకాల అడవిలో సీతమ్మలొద్దిలో గుహ ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో బృం దంతో కలిసి వెళ్లినట్లు తెలిపారు. ఈ రాతి చిత్రాలలో మధ్యరాతి యుగం(12 వేల సంవత్సరాల నుంచి), తొలి చారిత్రక యుగం(క్రీస్తు శకం 1 నుంచి 6వ శతాబ్దం వరకు)వేసినవి, ఎక్కువగా ఎరుపు రంగులో, కొన్ని చోట్ల తెలుపు, పసుపు రంగులలో వేసిన పురాతన రాతి చిత్రాలు ఉన్నాయన్నారు. ఇలాంటి రాతి చిత్రాలు గతంలో ఎక్కడా లభించలేదని తెలిపారు. స్త్రీ, పురుషులు ప్రత్యేకమైన ఆహార్యంతో, పాదరక్షలు ధరించి ఒక పంక్తిలో, గుండ్రంగా చేతులు పట్టుకుని సామూహికంగా నృత్యాలు చేస్తున్న దృశ్యాలు ఉన్నాయని, జంతువుల చిత్రాలలో జింకలు, తాబేళ్లు, అడవి పిల్లి, కోతులు, అడవి బల్లుల బొమ్మలు, మనుషుల చిన్న, పెద్ద పాద ముద్రికలు ఉన్నాయన్నారు. బృందం ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్రను అన్వేషిస్తున్నామని, దానిని భావితరాలకు అందిస్తామన్నారు. తెలంగాణలో ఎంతో చరిత్ర ఉందన్నారు. పరిశోధనలతో చరిత్రను వెలుగులోకి తెస్తామన్నారు. రాతి చిత్ర నిపుణుడు, న్యూమిస్మాటిస్ట్ డాక్టర్ బండి మురళీధర్ రెడ్డి, సంస్థ కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, కో కన్వీనర్ గిరీష్, చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి, ఆర్కియాలజిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మహిళ హత్య కేసులో జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, జనవరి 31: సహజీవనం చేస్తున్న మహిళను కర్రతో కొట్టి ఆమె చావుకు కారకుడైన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు 5వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి లక్ష్మికుమారి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రం బక్కర్ గ్రామానికి చెందిన మహిళ రామ్ కాళీ (26)కి పెళ్లయి ఇద్దరు సంతానం ఉన్నారు. అదే గ్రామానికి చెందిన టిక్కం శ్యామ్‌రాజ్ (29)తో ఆమె అక్రమ సంబంధం కారణంగా రామ్‌కాళీ భర్త ఆమెతో విడాకులు తీసుకున్నాడు. తన ఇద్దరు పిల్లల్ని తల్లి దగ్గర వదిలి రామ్ కాళీ బతుకుదెరువు కోసం శ్యామ్‌రాజ్‌తో కలిసి కరీంనగర్‌కు వచ్చి అల్గునూర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటూ కూలీపనికి వెళ్తున్నారు. 2022 నవంబర్ 1న మేస్త్రీ శ్యామ్‌రాజ్‌కు కూలి డబ్బులు ఇవ్వగా అవి నాకు ఇవ్వాలని వాటిని తల్లి పిల్లల పోషణకు పంపించాలని శ్యామ్‌రాజ్‌తో గొడవ పడింది. కొద్ది డబ్బులు తన దగ్గర ఉంచుకొని మిగతా డబ్బులను శ్యామ్ రాజ్ ఆమెకిచ్చినా వినకుండా మొత్తం డబ్బులు కావాలని ఆమె అడుగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీనితో శ్యామ్‌రాజ్ అక్కడే ఉన్న కర్రతో రామ్ కాళిని తలపై కొట్టగా తీవ్ర గాయాలతో ఆమె చనిపోయింది. ఈ సంఘటనపై ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి శ్యాంరాజుపై హత్యానేరం నమోదు చేయగా సీఐ శశిధర్‌రెడ్డి దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలురు శ్రీరాములు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యామూర్తి శ్యామ్‌రాజ్‌కు జీవిత ఖైదుతోపాటు 5వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, జనవరి31: పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన ఇల్లెందుల గంగాధర్ (45) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన గంగాధర్ పట్టణంలోని అర్బన్ కాలనీలో భార్యాపిల్లలతో నివాసం ఉంటూ కుల వృత్తి అవుసుల పని చేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి గంగాధర్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ తరచుగా బాధపడేవాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంగాధర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఓయూలో విద్యార్థి ఆత్మహత్య


ఎర్ర నవీన్(ఫైల్)

తార్నాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన ఎర్ర నవీన్ (23) ఓయూలో ఎం.కామ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు చేసి బిట్ కాయిన్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో గత కొద్ది రోజులుగా తీవ్ర మనస్తాపం చెందిన నవీన్ ఓయూలోని మంజీరా హాస్టల్‌లో మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు నవీన్‌ను హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఓయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ పంచాయతీ విషయమై రైతు ఆత్మహత్యాయత్నం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 31: ఐదేళ్లుగా భూపంచాయతీని పెద్దమనుషులు సాగదీస్తుండడంతో జీవితం మీద విరక్తి చెందిన మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన రైతు బొజ్జం శివకృష్ణ బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అంతకు ముందు ఆత్మహత్య చేసుకుంటున్నానని సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేయగా వైరల్‌గా మారింది. గ్రామానికి చెందిన పెద్ద మనుషులు పంచాయతీని సాగదీస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ శివకృష్ణ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడిని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 31: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి చంద్రాపూర్ వైపు వెళ్తున్న బోలోరో వాహనం తుమ్మన్నపల్లి గ్రామ శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం నడుపుతు న్న గురుదాస్‌సింగ్‌దార్(53) అక్కడికక్కడే మృతి చెందగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మృతదేహాన్ని, క్షతగాత్రుడిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, జనవరి31: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బుధవారం ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో తొలివిడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ రెండు పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో రెండు పరీక్ష కేంద్రాలలో కలిపి 880మందికి 862 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 18మంది గైర్హాజరైయ్యారు. మధ్యాహ్నం 3నుంచి 6గంటల జరిగిన రెండవ సెషన్‌లో 817 మందికి 760మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 57మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఎన్‌టిఏ సీటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.



బ్రిడ్జికి ఇరువైపులా కుంగుతున్న రోడ్డు

- ఐదేళ్లకే పగుళ్లు చూపుతున్న వంతెన



బ్రిడ్జికి ఇరుపక్కల కుంగిన రహదారి

కోనరావుపేట, జనవరి 31: ఐదు సంవత్సరాల క్రితం ప్రారంభించిన బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు కుంగిపోయింది. అంతేకాకుండా ప్రారంభించిన ఐదేళ్లకే బ్రిడ్జి పగుళ్లు చూపుతోంది. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలంలోని సుద్దాల, వేములవాడ మండలం మారుపాక గ్రామాల మధ్య గతంలో ఉన్న కాజ్‌వే భారీ వర్షాలకు దెబ్బతిన్నది. ఏడాది వరకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ కాజ్‌వే పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయేవి. ఈ విషయమై గతంలో పాలకులకు విన్నవించగా ఆ స్థానంలో బ్రిడ్జి నిర్మాణానికి 81 లక్షలు రూపాయలు మంజూరు చేశారు. 2017లో పనులు పూర్తి చేసి అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ప్రారంభించారు. ప్రారంభించిన రెండు సంవత్సరాలకే బ్రిడ్జికి ఇరుపక్కల ఉన్న రహదారి కుంగిపోయింది. దీంతో బ్రిడ్జి మీది నుంచి వెళ్లడానికి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా బ్రిడ్జికి ఇరుపక్కల కట్టిన గోడలు పగుళ్లు చూపుతున్నాయి. వర్షాకాలంలో బ్రిడ్జి పైననే నీరు నిలిచి ఇబ్బందికరంగా మారుతోంది. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో బ్రిడ్జికి ఇరుపక్కల ఉన్న రోడ్డుకు సుద్దాల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మొరంపోసి బాగు చేసుకున్నారు. మళ్లీ కుంగడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు ఇరుపక్కల పొంగిన స్థానంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని మండల వాసులు కోరుతున్నారు.



పగుళ్లు చూపిన గోడ

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ

ఇల్లంతకుంట, జనవరి 31: పదవి లేకపోయినా కూడా సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించాలని, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణా రెడ్డి అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులు కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారన్నారు. చాలా గ్రామాల సర్పంచుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలకంగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, ఎంపీడీవో మీర్జా తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని పలువురు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, దేవునిగుంట తండా, బుగ్గరాజేశ్వరతండా, సింగారం గ్రామాల్లో పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో బుధవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విశేష కృషి చేశారన్నారు. అనంతరం పాలక వర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు. గొల్లపల్లిలో 4, 8వ వార్డుల సభ్యులు దాసరి పూర్ణిమ- గణేశ్ దంపతులు పారిశుధ్య కార్మికులకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం పదవీ కాలం ముగుస్తున్నందున సర్పంచ్‌లను సన్మానించారు. నర్మాల సర్పంచ్ రాజును, కొత్తపల్లి సర్పంచ్ సరళ, అధికారులు, నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం గర్జనపల్లి సర్పంచ్‌గా గొర్రె కరుణ రంజిత్ కుమార్ ఐదు సంవత్సరాల కాలం పూర్తయిన సందర్భంగా పంచాయతీ పాలకవర్గం, గ్రామ విద్య, వైద్య సిబ్బందితోపాటు, సుభాష్ సంఘం, మాల సంఘం సభ్యులు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరుణ గ్రామ అభివృద్ధిలో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామస్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండలం రామన్నపేట గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీ పాలకవర్గంను బుధవారం గ్రామస్తులు సన్మానించారు. సర్పంచుల పదవీకాలం ముగిస్తున్నందున, గ్రామంలో ఐదు సంవత్సరాల పాటు సేవలందించిన సర్పంచ్ దుమ్మ అంజయ్య, ఉప సర్పంచ్ చింతం భూలక్ష్మీ, కార్యదర్శి సందీప్‌తోపాటు వార్డు సభ్యులను, గ్రామ పంచాయతీ సిబ్బందిని, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాటు గ్రామ అభివృద్ధికి సహకరించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అజయ్, రాములు, తిరుపతి, వర్షిని, దేవేంద్ర, శ్రీనివాస్ రెడ్డి, అంగన్వాడి టీచర్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన పాలక వర్గం సభ్యులు

దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 31: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో తెలంగాణ పోరాట సమరయోధుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సర్పంచ్ వెంకట్ రెడ్డికి అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజుయాదవ్ బుధవారం వినతి పత్రం అందజేశారు. విగ్రహ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన సర్పంచ్ వెంకట్‌రెడ్డి తీర్మానం చేస్తూ పత్రాన్ని అందించారని బాలరాజుయాదవ్ పేర్కొన్నారు. ఉప సర్పంచ్ రజిత, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



నగదు అందజేస్తున్న హమీద్

గంభీరావుపేట, జనవరి 31 : గంభీరావుపేట మండలానికి చెందిన ముగ్గురు క్రికెట్ క్రీడాకారులు ఇటీవల ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్‌లో రాణించారు. మండల కేంద్రానికి చెందిన పాపగారి అక్షయ్‌నారాయణ, సాయబుగారి కాంత్, ముస్తాఫనగర్‌కు చెందిన చిలుక అజయ్ హైదరాబాద్‌లో నిర్వహించిన క్రికెట్ లీగ్‌లో గ్రీన్ టికెట్ సాధించి మొదటి దశకు అర్హత పొందారు. రెండో దశ ఎంపిక కోసం ఈ ముగ్గురు క్రీడాకారులు బుధవారం ముంబాయి వెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ అభినందించారు. తన వంతు బాధ్యతగా రూ.5 వేల నగదు అందజేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పాపగారి రాజు ఉన్నారు.

బ్యాంక్ పథకాలపై అవగాహన

ఎల్లారెడ్డిపేట, జనవరి 31: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంక్ డిపాజిట్ పథకాలపై బుధవారం అవగాహన కల్పించారు. కల్పతరువు, కామధేనువు వంటి డిపాజిట్ పథకాల గురించి వివరించారు. బ్యాంక్‌లో డిపాజిట్ చేసి అధిక వడ్డీ పొందాలని కోరారు. బ్యాంక్ మేనేజర్ సురేశ్‌పాల్గొన్నారు.

పోటాపోటీగా జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్

సిరిసిల్ల టౌన్, జనవరి 31: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల మినీ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటాపోటీగా సాగాయి. ముందుగా పరుగు(రన్నింగ్)పందెం పోటీలను అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం 8, 10, 12, 14, సంవత్సరాల బాలబాలికలకు ట్రాక్ అండ్ ఫీల్డ్ 50 మీటర్లు, 100, 300, 400, 600 మీటర్ల రన్నింగ్(పరుగు పందెలు)పోటీలు అదే విధంగా స్టాండింగ్ బ్రాడ్ జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలను నిర్వహించారు. పోటీలో విజేతలైన బాలబాలికలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తోపాటు మెరిట్ సర్టిఫికెట్స్‌ను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలో ప్రతిభ కనబరిచిన 25 మంది బాలబాలికలు ఈ నెల 10న భద్రాది కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్‌కు పంపించనున్నట్లు చెప్పారు.

ప్రమాదవశాత్తు ఉదరవాగులో పడిన వ్యక్తి.. రక్షించిన కౌన్సిలర్

సిరిసిల్ల టౌన్, జనవరి 31:సిరిసిల్ల పట్టణం 36వ వార్డు వెంకంపేట ఉదరవాగు (ప్రధాన మురికికాలువ)లో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు పడిపోయాడు. బుధవారం తెల్లవారు జామున వాకింగ్ కోసం అటుగా వెళ్లిన కౌన్సిలర్ కల్లూరి రాజు ఉదరవాగులో వ్యక్తి పడి ఉండడాన్ని గుర్తించారు. స్థానికుల సాయంతో బయటకు తీసుకొచ్చి అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 31 : ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రభుత్వ వసతి గృహం వద్ద బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. పక్కా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలను కల్పించే విధంగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, సందీప్, నరేష్, అరుణ్, మని, కార్తిక్ పాల్గొన్నారు.

రేషన్ షాపు రద్దు చేయాలి

తంగళ్లపల్లి, జనవరి 31: నిబంధనలకు విరుద్ధంగా రేషన్ షాపు నిర్వహిస్తున్న తంగళ్లపల్లి ఎంపీటీసీ, ఎంపీపీ మానసపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు కోరారు. బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధిగా గౌరవ వేతనం పొందుతూ రేషన్ షాపు నిర్వహిస్తూ లబ్ధి పొందడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా గళం విప్పిన గద్దర్



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 31:శ్రామిక దోపిడీకి వ్యతిరేకంగా గద్దర్ తన కళాన్ని కదిలించి గళాన్ని వినిపించి ప్రజాస్వామిక హక్కులు, పౌర హక్కులు, స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసం పోరాడారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి నిర్వహించారు. కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూప్రజల మనస్సుల్లో గద్దర్ చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో గద్దర్ సేవలు మరవలేనివన్నారు. తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలను జాగృత పరచారన్నారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ వెనకబడిన కారణాలను కలం, గళం ద్వారా వినిపించారని, తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోస్తూ యువకులను ఉత్తేజ పరిచి తెలంగాణ రావడంలో కీలక భూమిక పోషించారని అన్నారు. రాష్ట్రం వచ్చాక దళిత, బడుగు, బలహీన వర్గాలకు సముచిత న్యాయం కావాలని కోరుకున్నట్లు చెప్పారు. సాధించుకున్న తెలంగాణలో నియంతృత్వ పోకడ, అవినీతి పరిపాలన కొనసాగిస్తున్న నాటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలు చేశారన్నారు. గద్దర్ మనలో లేని లోటు కళ్లకు కొట్టచ్చినట్లు కనబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ప్రజల తరపున నిలిచేవారన్నారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ప్రేమిస్తుందనడానికి ఈ రోజు ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని అధికారికంగా నిర్వహించడమే నిదర్శనమన్నారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మాజీ కౌన్సిలర్లు జగన్, చంద్రకళ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు పనులకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్

చందుర్తి, జనవరి 31: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతీ గ్రామపంచాయతీకి ట్రాక్టర్ మంజూరు చేస్తే ప్రజాప్రతినిధులు సొంత పనులకు వినియోగించుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో చెత్తను డంపింగ్‌కు తరలించడంతోపాటు హరితహారం, ప్రకృతి వనం మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం పంచాయతీ కార్యాలయాలకు ట్రాక్టర్లను మంజూరు చేసింది. దానికి భిన్నంగా ప్రజాప్రతినిధులు, అధికారులు తమ వ్యవసాయ పనులకు, అదే విధంగా ప్రైవేట్ పనులకు వినియోగించుకొని సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఎనగల్ గ్రామపంచాయతీ చెందిన ట్రాక్టర్‌ను కొద్ది రోజుల నుంచి వ్యవసాయ పనులతోపాటు గ్రామంలోని సీసీ రోడ్ల నిర్మాణం ఒర్రెల ఇసుక తరలింపునకు ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ పంచాయతీ నిధుల నుంచి నెలవారీగా ఈఎంఐ రూపంలో లోన్ చెల్లిస్తుంటే గ్రామ పంచాయతీ ట్రాక్టర్ మాత్రం ప్రైవేట్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారని, పట్టించుకునే నాథుడే లేరని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వరి నారు తరలిస్తున్న పంచాయతీ ట్రాక్టర్

ఉద్యమకారులను అవమానిస్తున్న కేసీఆర్



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 31:తెలంగాణ ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని అడ్డుకొని కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారులను, ప్రజలను అవమానిస్తున్నారని అఖిల పక్షం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం తెలుపుతూ కోర్టుకు వెళ్లడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో అఖిల పక్షం నాయకులు కళ్లకు నల్లగుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అఖిల పక్షం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్రను పోషించిన ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడం బీఆర్ఎస్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని తెలంగాణ ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ సారథిగా అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారన్నారు. కోదండరాం ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్, సడక్ బంద్, సకల జనుల సమ్మె చేపట్టినట్లు గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్రను పోషించిన ఉద్యమకారుడు కోదండరామ్‌కు గవర్నర్ కోటాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ ఇవ్వాలన్న నిర్ణయాన్ని గవర్నర్ కూడా ఆమోదించారన్నారు. దీంతో బీఆర్ఎస్‌లో ప్రకంపనాలు మొదలై కోర్టును ఆశ్రయించి ప్రమాణస్వీకారం అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలి పెట్టని, తెలంగాణ ప్రజలు హర్షించరని అన్నారు. కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనకయ్య, కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప, నాయకులు సదానందం, రవి, రాములు, బాలచందర్, మల్లయ్య, శంకర్, ఆనంద్ పాల్గొన్నారు.

ఆకతాయిలు వేధిస్తే షీ టీమ్‌ను సంప్రదించాలి

వేములవాడ టౌన్, జనవరి 31 : ఆకతాయిలు వేధిస్తే బాలికలు, మహిళలు షీ టీమ్‌ను సంప్రదించాలని షీ టీమ్ ఎస్సై ప్రమీల సూచించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మహిళలు పని చేసే చోట వేధింపులు వంటివి ఎదురైతే ఫిర్యాదు చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కరుణ అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

కులంపేరుతో దూషిస్తే చర్యలు

రుద్రంగి, జనవరి 31: రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీలత మాట్లాడుతూ ఎవరైన కులం పేరుతో దూషిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎంపీవో సుధాకర్, కార్యదర్శి రాందాస్, ఆర్ఐ నవీన్, హెడ్ కానిస్టేబుల్ బాపురెడ్డి, నాయకులు గుగ్గిళ్ల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 31: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ ఆర్ఎంపీ, పీఎంపీ భవనంలో బుధవారం సీఐటీయూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశ్నాన యూనియన్ అధ్యక్షుడు మల్యాల నర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండలాల వారీగా స్థానిక సమస్యలు, పెండింగ్ జీతాలుపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 5 కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య ఇతర విభాగాల్లో పనిచేస్తూ సేవలు అందిస్తున్న ఉద్యోగ, కార్మికులకు జిల్లాలో నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పనిభారం మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. కొన్ని మండలాల్లో ఆరు నెలల నుంచి కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, కార్మికులు పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని అన్నారు. కార్మికుల పరిస్థితులను కలెక్టర్ గుర్తించాలని, పెండింగ్ జీతాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులతో ధర్నా చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, యూనియన్ జిల్లా నాయకులు వరుకోలు మల్లయ్య, లింగంపల్లి కృష్ణవేణి, నర్సయ్య, అంజయ్య, మహేష్, భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలవాలి

తంగళ్లపల్లి, జనవరి 31: ప్రజలకు ప్రభుత్వానికి కార్యకర్తలు వారధిగా నిలవాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో స్థానిక సర్పంచ్ బొబ్బల మంజుల మల్లేశంతోపాటు పలువురు కేకే మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారెంటీలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. బిల్లులు ఇవ్వని గత ప్రభుత్వం సర్పంచుల తరపున పోరాడాతమని చెప్పడం సిగ్గు చేటన్నారు. ప్రజల కోసం పనిచేసిన సర్పంచులకు కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

3 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి ఆటల పోటీలు

ఇల్లంతకుంట, జనవరి 31: మండలంలోని రేపాక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఈ నెల 3 నుంచి రెండు రోజులపాటు ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్‌క్లబ్ సభ్యులు ప్రకటనలో తెలిపారు. ఎంట్రీఫీజు లేదని, ప్రతీ జట్టు డ్రెస్‌కోడ్ పాటించాలని కోరారు.

పూర్వవిద్యార్థుల సహకారంతో తరగతి గదుల నిర్మాణం

ఇల్లంతకుంట, జనవరి 31: పూర్వవిద్యార్థుల సహకారంతో నిర్మించిన తరగతి గదులు ప్రారంభం అయ్యాయి. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.10లక్షలతో రెండు గదులు నిర్మించగా ప్రారంభించారు. తాము చదువుకున్న పాఠశాలలో సమస్యల పరిష్కారం కోసం ఏకమైన పూర్వ విద్యార్థులు కొద్ది రోజులుగా విరాళాలు సేకరించారు. సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మిబాలరాజు, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, యువజన సంఘాల అధ్యక్షుడు ఉప్పల అమర్, ప్రధానోపాధ్యాయిని ప్రేమలత పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 31: అంకితభావంతో పని చేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని వక్తలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు భాస్కర్, గోవుల కొండ శ్రీనివాస్, లక్ష్మణ్, శ్రీనివాస్, మురళి, భాగ్యలక్ష్మీ పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. పాఠశాలకు తమ వంతుగా ఉపాధ్యాయులు రూ.10 వేల విలువైన వాటర్ కూలర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజన, హెచ్‌ఎం మురళీధర్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవయ్య, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన దాసరి రవీందర్, చర్లపల్లి సత్తయ్య, అనే ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా వారికి బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి, విద్యా కమిటీ చైర్మన్ తమ్మెట జీవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయిని సుహాసిని, పాఠశాలలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయిని లక్ష్మీ బదిలీపై వెళ్లడంతో ఎంఈవో బన్నాజీ సన్మానించారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

సిరిసిల్ల క్రైం, జనవరి 31:గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంతోపాటు ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పాన్‌షాప్‌లు, కిరాణా దుకాణాల్లో పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్‌షాప్‌లు, కిరాణా దుకాణాలపై 24గంటలు పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తే వెంటనే 6303922572 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. మత్తుపదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తోందన్నారు. జిల్లాలో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంతకుముందు సిరిసిల్ల పట్టణంలో గంజాయి చాక్లెట్లు పట్టుకొని కేసులు నమోదు చేశామన్నారు. డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, సీఐలు పాల్గొన్నారు.

ప్రజలు ఛీకొట్టిన మారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల తీరు

ఎల్లారెడ్డిపేట, జనవరి 31: ప్రజలు ఛీకొట్టిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల్లో మార్పు రావడం లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 30న మండలంలోని దుమాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించి ఏర్పాటు చేసిన సభలో బీఆర్ఎస్ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. ప్రజాప్రతినిధులు గౌరవం కాపాడుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల అహంకారంతోనే ప్రజలకు దూరమయ్యారన్నారు. ప్రభుత్వం మారినా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు గ్రహించడం లేదన్నారు. తమ ప్రభుత్వంలోనూ ప్రజాప్రతినిధులకు విలువ ఇస్తూ కార్యక్రమాలకు ఆహ్వానిస్తే దుర్బుద్ధిని వెళ్లగక్కుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, తిరుపతిగౌడ్, సత్తయ్య, రాంచంద్, రాంరెడ్డి, బాబు, రఫీ, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుగా ఎంపికపై హర్షం

వేములవాడ టౌన్, జనవరి 31 : వేములవాడ మండలం సంకెపల్లికి చెందిన నాగుల దివ్య స్టాఫ్ నర్సుగా ఎంపికవడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన నాగుల రాజేశం అనే గీతకార్మికుడి కూతురు దివ్య స్టాఫ్ నర్సుగా ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అపాయింట్ మెంట్ లేటర్ అందుకున్నారు. యువతిని ఎంపీటీసీ బుర్ర లహరిక, సర్పంచ్ జింక సునితవేణు అభినందించారు.

కేటీఆర్‌ది మేనేజ్‌మెంట్ కోటా..

- రేవంత్‌ది మెరిట్ కోటా
- కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి



ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్, జనవరి 31: కష్టపడి అంచెలంచెలుగా ఎదిగి మెరిట్ కోటాలో వచ్చిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి అని, తండ్రి పేరుతో మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన వ్యక్తి కేటీఆర్ అని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను అసహ్యించుకుంటున్నా కేటీఆర్ అహంకార పూరితంగా మాట్లాడుతున్నారన్నారు. కేటీఆర్ దురహంకార వైఖరితో సిరిసిల్లలో ఆ పార్టీ 70 శాతం ఖాళీ అవుతుందన్నారు. రేవంత్‌రెడ్డిపైనగానీ, కాంగ్రెస్‌పైనగానీ మాట్లాడితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఉద్యమంతో, సిరిసిల్లకు సంబంధం లేకున్నా 2009లో సిరిసిల్లలో టికెట్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఉద్యమకారులకు అన్యాయం చేశారన్నారు. కేసీఆర్ ఉద్యమాన్ని సొంత జాగీరుగా మలుచుకున్నారని విమర్శించారు. కాపలా కుక్కలా ఉంటానని చెప్పిన కేసీఆర్ గుంట నక్కలా మారారన్నారు. రేవంత్‌రెడ్డి విద్యార్థి దశ నుంచి అంచెలంచెలుగా ఎదిగినట్లు చెప్పారు. ఆయనను కించపరచడం తగదన్నారు. కష్టపడ్డ వారికి కాంగ్రెస్‌లో స్థానం ఉంటుందన్నారు. ప్రజల సొమ్ముతో ప్రగతి భవన్ కట్టుకొని మాజీ సీఎం కేసీఆర్ బయటకు రాలేదన్నారు. అధికారం పోయి బజారున పడిన వ్యక్తి అని, విచక్షణ కోల్పోయి ఇష్టారీతిలో మాట్లాడుతూ తెలంగాణ సంప్రదాయలను కోల్పోచారన్నారు. సంస్కారవంతంగా మాట్లాడడం కేటీఆర్ మరిచారన్నారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, జడ్పీటీసీ గుండం నర్సయ్య, సర్పంచుల ఫోరం కన్వీనర్ కలకొండ కిషన్ రావు, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మెర్గు యాదగిరిగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, బుర్ర రాములుగౌడ్, కొండం రాజిరెడ్డి, దేవిరెడ్డి, రంజాని నరేశ్, రాకేశ్, దీటి నర్సింల, సద్ది మధు, అనిల్, దశరథం, ఉచ్చిడి బాల్‌రెడ్డి, మిరియాల్‌కార్ శ్రీనివాస్, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, మిరుదొడ్డి దేవయ్య, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ మండల కేంద్రంలోని రాజీవ్ కూడలిలో ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జడ్పీటీసీ నర్సయ్య, సర్పంచుల ఫోరం కన్వీనర్ కిషన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు యాదగిరి గౌడ్, మాజీ ఎఎంసీ చైర్మన్ అంజనేయరావు, పట్టణ అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.